క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రంగారెడ్డి పర్యటన

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం ఇబ్రహీంపట్నం మండలంలో పర్యటించనున్నారు. నెర్రపల్లి, పోచారం, ఎల్మినేడు, కప్పపహాడ్, తుర్కగూడ, చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ గ్రామాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పట్నంలోని శాస్త్ర ఫంక్షన్‌హాల్‌లో మహిళా శక్తి సంబరాల కార్యక్రమంలో పాల్గొని, వడ్డీలేని రుణాలు, బీమా, యాక్సిడెంట్ బీమా చెక్కులను అందజేయనున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన సభ్యులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం ఇంజాపూర్‌లోని శాంతివనం కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా శివ ప్రసాద్ రాజు, కోశాధికారిగా మెగావత్ గణేశ్, ప్రధాన కార్యదర్శిగా ఫణిందర్, కార్యదర్శిగా రాజు నాయక్, గౌరవ అధ్యక్షుడిగా నరసింహా రెడ్డిని నియమించారు. అనంతరం నూతన సభ్యులను కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

ఇన్‌చార్జి తహసీల్దార్ సంతోష్



ఆమనగల్లు: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తలకొండపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ సంతోష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఖానాపూర్ గ్రామ శివారులో సర్వే నంబర్ 252, 256,253,1,39,42,22,18,38లో 64 ఎకరాల 19 గుంటల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ఆ జాగకు సంబంధించి కాంక్రిట్ పిల్లర్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎవరైన ఆ భూమిని చదును చేసినా, ఆక్రమించేందుకు యత్నించినా, కాంక్రీట్ పిల్లర్స్ తొలగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఐ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా రాజు



తుర్కయంజాల్: సీపీఐ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఇంజాపూర్‌కు చెందిన అనంతుల కాటంరాజు గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన ఆ పార్టీ మహాసభల్లో రాజును నియమించామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు


బాధితురాలు అరుణమ్మ

మాడ్గుల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఓ ఇల్లు కూలింది. ఈ సంఘటన మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఉన్న ఇల్లు కూలి రోడ్డున పడ్డానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలు అరుణమ్మ కోరారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

కడ్తాల్: దివ్యాంగులు, చేయూత పెన్షన్ దారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నిస్సహాయ స్థితిలో ఉండి కేవలం పింఛన్ మీదనే ఆధారపడి జీవిస్తున్న వారికి ఆసరా అందజేసి ఆదుకోవాలని కోరారు. పెన్షన్ దారుల హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆమనగల్లులో నిర్వహించే దివ్యాంగుల, చేయూత పెన్షన్ దారుల ఆవేదన జిల్లా సన్నాహక సదస్సుకు.. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ రానున్నారని తెలిపారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, బీడీ, నేత కార్మికులు, చేయూత పెన్షన్ దారులు తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

హైవేపై ట్రా‘ఫికర్’

నిత్యం వేలాది వాహనాలు కొత్తగా రోడ్డుపైకి వస్తున్నాయి. కానీ అందుకు తగిన రహదారి విస్తరణ, ట్రాఫిక్, వేగ నియంత్రణ చర్యలు సరిగా లేవు. దీనికి తోడు ఫుట్‌పాత్ ఆక్రమణలు. ఫలితంగా ట్రాఫిక్ కష్టాలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు సకాలంలో గమ్యానికి చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

- నిబంధనలు శూన్యం
- శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్
- ఫుట్‌పాత్ ఏరియాలో చిరువ్యాపారాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, పాదచారులు


శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

కడ్తాల్: మండల కేంద్రం మీదుగా శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకోపోకలు సాగిస్తుంటాయి. రహదారికి ఇరువైపులా రోడ్డుపైనే చిరువ్యాపారులు జీవనోపాధి పొందుతుంటారు. ఇక ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ప్రయాణికులను ఎక్కించుకోవడానికి రోడ్డుపై నిలుపుతుండటంతో పాదచారులు, ప్రయాణికులతో పాటు వాహనదారులూ ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డివైడర్ ఏర్పాటు చేసి. నాలుగు వరుసలుగా రోడ్డును నిర్మించారు. దీంతో రోడ్డు వాహనాల పరుగులతో రద్దీగా ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్‌కు ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కాలినడక ఏరియాలో చిరువ్యాపారులు దుకాణాలు కొనసాగిస్తుండటంతో వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్డుపై తమ వాహనాలకు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ జాం అవుతోంది. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీపై.. కొందరు షెడ్లు నిర్మించుకొని దుకాణాలు కొనసాగిస్తుండటంతో పాదచారులకు ఇబ్బంది తప్పడంలేదు.

రోడ్డుపైనే ఆర్టీసీ బస్సులు

రోడ్డుపైనే వాహనదారులు వారి వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. బస్టాండ్ లేక పోవడంతో ఆర్టీసీ బస్సులు కూడా రోడ్డుపైనే ఆగుతున్నాయని, దీంతో వెనకాల వచ్చే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణ సముదాయాలు, హోటల్స్ ఉండటంతో కొనుగోలుదారులు తమ బైక్‌లను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. వేల సంఖ్యలో పరుగులు తీసే శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై.. వాహనాలు నిలపకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకొని, ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: దక్షిణ తెలంగాణలో ప్రఖ్యాతిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, వేద పండితులు మంత్రోచ్చారణలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేయగా.. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఈఓ స్నేహలత, తహసీల్దార్ జ్యోతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు అరుణ్‌కుమార్, యాదగిరిరెడ్డి, లక్పతినాయక్, జవహర్‌లాల్, హీరాసింగ్ రామకృష్ణ, భూపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, శేఖర్‌గౌడ్ ఉన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి

ఆమనగల్లు: యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించి, ఆర్థికంగా రాణించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆమనగల్లు పట్టణంలో ఓ యువకుడు ఏర్పాటు చేసిన దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లయ్య, రాకేశ్, రాములు, జగన్, కేశవులు, మానయ్య, ఖాదర్‌ఖాద్రీ, శ్రీశైలం, కృష్ణనాయక్, బాబా, నర్సింహ తదితరులు ఉన్నారు.


కడ్తాల్: అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


సీసీ కెమెరాలు ప్రారంభించిన ఏసీపీ కాశిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు కీలక భూమిక పోషిస్తాయని ఏసీపీ కాశిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి ఇనాంగూడ గ్రామం కార్తీక్‌హోమ్స్ ఫేస్- 2లో 16 సీసీ కెమెరాలను సీఐ అశోక్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నివాస, వ్యాపార, వాణిజ్య, విద్యాలయాల్లో కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, షీటీం, డయల్ 100 తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఊషయ్యగౌడ్, మాజీ సర్పంచ్ యశోద, ఎస్ఐ బద్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో గన్‌పార్క్’కు తరలిరండి

చేవెళ్ల: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని నిర్వహిస్తున్న చలో గన్ పార్క్ మహాధర్నాను విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 22న ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో చలో గన్‌పార్క్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మొయినాబాద్‌లో ఉద్యమ అమరుడు యాదిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

కుక్కల దాడిలో మేకల మృతి

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో నాలుగు మేకలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కురువ మల్లేశ్ మేకల పోషణతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజు మాదిరిగా మేకలను శనివారం రాత్రి తన వ్యవసాయ పొలంలోని కొట్టాంలో ఉంచి ఇంటికి మల్లేశ్ వెళ్లాడు. మరుసటి రోజు ఆదివారం ఉదయం మంద వద్దకు వెళ్లి చూడగా కుక్కలు దాడి చేసి నాలుగు మేకలను చంపేసినట్లు గుర్తించి గ్రామస్తులకు తెలియజేశాడు. మేకల విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని, ప్రభుత్వమే తనని ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేస్తున్నాడు.

ఘనంగా బోనాలు

తుర్కయంజాల్: పురపాలక సంఘంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తుర్కయంజాల్‌లోని కట్టమైసమ్మ దేవాలయం వద్ద ఉదయం 6 గంటల నుంచి భక్తుల రద్దీ కొనసాగింది. రాగన్నగూడలోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి భక్తులు బోనమెత్తారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి తెలిపారు.


నెత్తిన బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు


రాగన్నగూడ పోచమ్మ దేవాలయంలో

నేషనల్ స్టార్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇండియా షోటోఖాన్ కరాటే మాస్టర్ శివకృష్ణగౌడ్ నేషనల్ స్టార్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఆదివారం ఏపీలోని విజయవాడ నగరంలో వైఎంకే అకాడమి ఆధ్వర్యంలో గుజ్జల సరళదేవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేశారు. వైఎంకే అకాడమి మాస్టర్ రూపస్‌పాల్ సినీహీరో భానుచందర్ చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకున్నట్లు శివకృష్ణగౌడ్ తెలిపారు.


అవార్డు అందుకుంటున్న శివకృష్ణగౌడ్

పాఠశాలకు బెంచీల వితరణ


బెంచీలను అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌లోని ఓ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంచీలను ఆదివారం అందించారు. సికింద్రాబాద్ జూనియర్ ఛాంబర్స్ చారిటబుల్ ట్రస్ట్ బెంచీమార్క్ త్రీ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలకు చైర్మన్ నాగశ్రీధర్ 40 బెంచీలను అందజేశారు. విద్యాభివృద్ధికి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ మాజీ చైర్మన్ కమలాకర్ ముత్యాలు, ప్రధానోపాధ్యాయులు చక్రధర్‌రావు, మల్లికార్జున్, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని కుల్కచర్ల, చాపలగూడెం, తిర్మలాపూర్, లాల్‌సింగ్ తండా, రాంపూర్, కుస్మసముద్రం, అనంతసాగర్ తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రాంపూర్, సాల్వీడు గ్రామాల్లోని చెంచు కాలనీలలో రూ. 50లక్షలతో మల్టీపర్పస్ భవనాలను నిర్మించేందుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరిగి నియోజకవర్గ పరిధిలో 3,500మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. ప్రతీ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5,143మందికి నూతన రేషన్‌కార్డులను అందజేశామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని దశల వారీగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ సత్యమ్మ, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు పి.వెంకటయ్య, నాయకులు కుమ్మరి స్వామి, లక్ష్మయ్య, కృష్ణయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.


మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కులం పేరుతో దూషించిన వారిని శిక్షించాలి

- సీఐటీయూ, దళిత, ప్రజాసంఘాల డిమాండ్
- 4న ఎస్పీ కార్యాలయం ముట్టడి


మాట్లాడుతున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

తాండూరు టౌన్: ఎరుకల కుటుంబంపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన వారిని అరెస్టు చేయాలని దళిత, ప్రజా, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. తాండూరు మండలం చెన్‌గేష్ పూర్ గ్రామానికి చెందిన ఎరుకలి శారద, బస్వరాజ్ కుటుంబంపై అదే గ్రామానికి చెందిన రమేశ్ గౌడ్, నరేందర్ గౌడ్, నాని గౌడ్, నరేష్ గౌడ్, పవన్ గౌడ్‌లు అకారణంగా గత నెలలో దాడి చేశారని తెలిపారు. ఈ విషయం గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తమ పోరాటంలో భాగంగా ఈ నెల 4వ తేదీన ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దళిత, ప్రజాసంఘాల నాయకులు కె శ్రీనివాస్, చంద్రయ్య, నరేశ్, నవీన్ తదితరులు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం ఎన్నిక


నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కందుకూరు: బీసీ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆదివారం సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాలను నూతన కమిటీకి అందజేశారు. అధ్యక్షుడిగా బండ ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, డేరంగుల శ్రీరాములు, శ్రీనివాస్‌గౌడ్, బొడ్డుపల్లి రవి, ప్రధాన కార్యదర్శులుగా జంగయ్య ముదిరాజ్, బాల్‌రాజ్, దామోదర్‌గౌడ్, కోశాధికారిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా శేఖర్‌గౌడ్, కాళిదాసుచారి, బాబు, మహేందర్, శ్రీనివాస్‌చారి, ఎ.రమేష్‌గౌడ్, బి.రమేష్‌గౌడ్, నర్సింహ, ఎగ్గిడి కృష్ణ, నరేష్, వెంకటేశ్, జంగయ్య, రామకృష్ణ యాదవ్, శ్రీనివాస్ ముదిరాజ్, సురేందర్, ప్రచార కార్యదర్శులుగా వెంకటేశ్ గౌడ్, యాదయ్య ముదిరాజ్, లింగం యాదవ్, యాదయ్య, సీహెచ్ రవీందర్, అందె జైపాల్, బండ శ్రీను, మల్లేశ్, శంకర్, నర్సింహ, శివశంకర్, వరికుప్పల రాజు, ఢిల్లీ కృష్ణ, జగదీష్, సలహాదారులుగా బి.వెంకటేశ్, దేవేందర్, ఎస్.అంజయ్య, పి.వెంకటేశ్, ఎమ్మ అంజయ్య కుర్మలను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఆర్.కృష్ణయ్య తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

యజుర్వేద పారాయణ కరపత్రాల ఆవిష్కరణ


చౌదరిగూడలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్య సమాజం సభ్యులు

కొందుర్గు: చౌదరిగూడ ఆర్య సమాజంలో శ్రావణ మాసంలో నిర్వహించనున్న యజుర్వేద పారాయణ యజ్ఞం కరపత్రాలను సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. సమాజహితం కోసం గత 45 ఏళ్లుగా ఆర్య సమాజం ఆధ్వర్యంలో యజుర్వేద పారాయణ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఆగస్టు 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు యజ్ఞం చేపడుతున్నామని సంఘం ప్రతినిధి మచ్చ సుధాకర్‌రావు వివరించారు. యజ్ఞబ్రహ్మలుగా అరవింద్‌శాస్త్రీ, వసుదాశాస్త్రీలు వ్యవహరిస్తారని, ఆకారపు సుమతమ్మ, యాదగిరి దంపతులు భక్తులకు భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

25న చలో వేములవాడ

మహేశ్వరం: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం తలపెట్టిన చలో వేములవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు వాడికల పాండయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధి అమీర్‌పేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా ముందుకుసాగాలని సూచించారు. వేములవాడ వరకు నిర్వహించనున్న ర్యాలీకి భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణ, వి.సిద్దులు, శ్రీశైలం, శ్రావణ్, సత్యం, కుమార్, యాదయ్య, చంద్రయ్య, ప్రవీణ్‌పటేల్, శ్రీనివాస్, రమేష్, భిక్షపతి, వీరబాబు, నరసింహ, సిద్దులు, వి.నరసింహ, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఉమ్రా బయలుదేరిన యాత్రికులు


ఉమ్రాకు వెళ్తున్న యాత్రికులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన యాభైమంది యాత్రికుల బృందం ఆదివారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరారు. యాత్రికులకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు పూలమాలలతో సత్కరించి యాత్ర సజావుగా సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్రా యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మణికొండ: పేదలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించే సేవా కార్యక్రమాలు నిర్వాహకులకు మానసికంగా ఎంతో తృప్తినిస్తాయని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం లలిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరాంనగర్ కమ్యూనిటీ హాల్‌లో పేదలకు నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. ఇందులో ఫౌండేషన్ నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.


రేకులకుంటతండా చల్లంపల్లి రహదారి దుస్థితి


కంకర తేలిన రేకులకుంట- బాలాజీనగర్ తండా రోడ్డు

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

కడ్తాల్: తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శం. పల్లె ప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయి’ అని మన పాలకులు పదేపదే ఉపన్యాసాలు ఇస్తున్నప్పటికీ.. వాస్తవ రూపంలో అందుకు భిన్నమైన పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అధ్వాన రోడ్లు, పూర్తిగా అపరిశుభ్రత వాతావరం నెలకొంది. పారిశుధ్యం సంగతి ఎలా ఉన్నా.. మారుమూల ప్రాంతాల రోడ్లు పూర్తిగా రూపురేఖలు కోల్పోయాయి. అసలే వర్షాకాలం. దానికి తోడు గుంతలమయమైన రోడ్లు, బీటీ కోల్పోయి కంకర తేలిన రహదారులతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు కడ్తాల్ మండలం బాలాజీనగర్ తండా, బాలాజీనగర్‌కు వెళ్లే రోడ్డే నిదర్శనం. బాలాజీనగర్ తండా పూర్తిగా మట్టిరోడ్డే అయినప్పటికీ.. ఆ మార్గంలో భారీ టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటాయని, దీంతో భారీ గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక తండా నుంచి బాలాజీనగర్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా కంకరతేలిందని, ఈ మార్గంలో ప్రయాణం నరకంగా ఉందని తండా వాసులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ఈ రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు